# లక్ష్యం 2.80 లక్షల మొక్కలు

- పకడ్బందీగా నర్సరీల నిర్వహణ
- వేసవిలో మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు
- జూన్ మాసం నాటికి సిద్ధం చేసేందుకు ఏర్పాట్లు



కేతిరెడ్డిపల్లి నర్సరీలో ఏర్పాటు చేసిన గ్రీన్‌షెడ్

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా ప్రతీ గ్రామంలోని నర్సరీలో మొక్కల పెంపకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రతీ నర్సరీలో లక్ష్యం మేరకు మొక్కలు పెంచేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీలతో పాటు మున్సిపల్ పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు పెంచుతున్నారు. ప్రతీ నర్సరీలో 10వేల మొక్కలు పెంచే విధంగా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం 2.80లక్షల మొక్కల పెంపకమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించి పనులు చేపడుతున్నారు. జూన్ మాసం నాటికి మొక్కలను సిద్ధంగా ఉంచాలని భావిస్తున్నారు.

**వేసవిలో మొక్కలపై ప్రత్యేక దృష్టి**

వేసవిని దృష్టిలో పెట్టుకొని మొక్కల పెంపకంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రతీ నర్సరీకి గ్రీన్ షెడ్లను ఏర్పాటు చేశారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటి లెక్క తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి రోజూ మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందిస్తూ సంరక్షిస్తున్నారు. కలుపు మొక్కలను తొలగిస్తూ మొక్కలను ఏపుగా పెరిగేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**వివిధ రకాల మొక్కలు..**

ప్రతీ నర్సరీలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో పండ్లు, పూలు, కలప నిచ్చే వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. జామ, నిమ్మ, టేకు, వేప, మునగ, కానుగ, అల్లనేరేడు, దానిమ్మ, బొప్పాయి, కృష్ణతులసి, సీతాఫల్, తుర్కవేప, చింత, గన్నేరు, గోరింటాకు, మందార, చామంతి, ఉసిరి, చిన్నబాదం తదితర మొక్కలతో పాటుగా పలు రకాల పండ్ల మొక్కలను పెంచుతున్నారు. వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రైతులు, ప్రజలకు అవసరమైన మొక్కలను పెంచుతున్నారు.

### జాగ్రత్తలు తీసుకుంటున్నాం



గ్రామాల్లోని నర్సరీలలో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా నర్సరీలపై గ్రీన్‌షెడ్లను కొత్తగా ఏర్పాటు చేయించాం. ఎండాకాలంలో మొక్కలు ఎండిపోకుండా రెండు సమయాల్లో నీరు పట్టిస్తున్నాం. వనమహోత్సవంలో మొయినాబాద్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

–సంధ్య, ఎంపీడీఓ

### లక్ష్యం మేరకు మొక్కలు



ప్రభుత్వ లక్ష్యం మేరకు నర్సరీలలో మొక్కలను పెంచేందుకు కృషి చేస్తున్నాం. వచ్చే జూన్ నాటికి మొక్కలు ఏపుగా పెరిగేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో నర్సరీలను సందర్శించి మొక్కల ఎదుగుదలను పరిశీలిస్తున్నాం. ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులతో పాటు నర్సరీల నిర్వాహకులకు మొక్కల ఎదుగుదలపై పలు సూచనలు చేస్తున్నాం.

–వెంకటేశ్వరరెడ్డి, ఎంపీఓ

### రెండుపూటలా నీరు



మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి నర్సరీలో పది వేల మొక్కలను పెంచుతున్నాం. ఈ ఎండాకాలంలో మొక్కల సంరక్షణకు కొత్తగా గ్రీన్ షెడ్‌ను ఏర్పాటు చేశాం. ఉదయం, సాయంత్రం వేళ మొక్కలకు నీరు అందిస్తూ ఏపుగా ఎదిగేందుకు కృషి చేస్తున్నాం. ప్రస్తుతం రెండు నెలల్లోనే మొక్కలు ఎంతో ఎదిగాయి. నర్సరీలో మొక్కల ఎదుగుదలతో పచ్చదనం వచ్చింది.

–తారాబాయి, పంచాయతీ కార్యదర్శి, కేతిరెడ్డిపల్లి

# ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ధన్వంతరీ గ్రామీణ వైద్యులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. గురువారం పట్టణంలోని ధన్వంతరీ గ్రామీణ వైద్యుల సంఘం భవనంలో గ్రామీణ వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ వైద్యులు డబ్బులకు ఆశపడి తమ పరిధి దాటి వైద్యం చేయొద్దని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించే ఆర్‌ఎంపీలు, పీఎంపీలు కేవలం ప్రథమ చికిత్సలు మాత్రమే అందించాలని తెలిపారు. ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం వస్తే వారిని మంచి వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు పంపించాలన్నారు. కానీ ఇదే అదునుగా భావించి డబ్బులకు ఆశపడి వచ్చీరాని వైద్యం చేసి రోగులతో చెలగాటం ఆడితే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. గతంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయని, అలాంటివి తిరిగి పునరావృతం కావొద్దని సూచించారు. వైద్యారోగ్యశాఖ నిబంధనలు విధిగా పాటించాలని తెలిపారు.

**విద్యార్థులు చదువుల్లో రాణించాలి**

విద్యార్థులు చదువుల్లో రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి డిగ్రీ విద్య అనేది కీలకమైన మెట్టు అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. ప్రభుత్వం విద్యారంగాభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, విశ్వం, వెంకట్రామిరెడ్డి, రఘు, కొంకళ్ల చెన్నయ్య, శ్రీకాంత్ రెడ్డి, బస్వం, బాల్‌రాజ్‌గౌడ్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న నర్సింహారెడ్డి తదితరులు

కేశంపేట: వేసవి కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతీ రోజు పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని సూచించారు. వేసవిలో మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై వివరించారు. కొద్దినెలలుగా మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు లేకపోవడంతో వారు పనులకు డుమ్మా కొడుతున్నారని, వేతనాలను ప్రతి నెల అందిస్తున్నామని ఆయన తెలిపారు. విధులకు డుమ్మా కొట్టకుండా రావాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ కార్యదర్శులకు సహకరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను కూడా త్వరలోనే అందించేందుకు ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు.

**వినతిపత్రం అందజేత**

గ్రామ పంచాయతీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డికి జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి గురువారం వినతిపత్రం అందించారు. గత సంవత్సరం పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని, రోజుకు 8 గంటల పనిదినం అమలు చేయాలని వినతిపత్రంలో కోరామన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ కిష్టయ్య, కార్యదర్శులు, గ్రామ పంచాయతీ కార్మికులు, మల్టీపర్పస్ వర్కర్స్ ఉన్నారు.

# చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

నందిగామ: యువత చదువుతో పాటు తమకు నచ్చిన క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మామిడిపల్లిలో ఎంపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారందరికీ ఇలాంటి టోర్నమెంట్‌లు ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులు కేవలం చదువుపై మాత్రమే కాకుండా తమకు ఇష్టమైన రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు కాట్న మాధవి, మాజీ సర్పంచ్ కవిత, మాజీ ఉపసర్పంచ్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కొందుర్గు: అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించేందుకు అందరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బద్దుల జంగయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారత రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రస్తుత ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేలా బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత బీజేపీ పాలకులు అధికారం కోసం కుల, మతాలను వాడుకుంటూ ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ నాయకుల పాదయాత్ర

షాద్‌నగర్: ప్రధాని మోదీ మూడోసారి బాధ్యతలు చేపట్టడం, మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి డీకే అరుణ గెలుపొందడంతో బీజేపీ పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్ పటేల్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ నుంచి యాదగిరిగుట్ట వరకు పాదయాత్ర చేపట్టారు. గురువారం మూడోరోజు చంద్రాయన్‌గుట్ట నుంచి ప్రారంభమైన పాదయాత్రలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి పాల్గొని పాదయాత్ర చేపట్టిన నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ పాలనతోనే ప్రజలందరికీ సమన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పార్టీని బలోపేతం చేయడంతో పాటుగా సనాతన ధర్మాన్ని రక్షించేందుకు ఇలాంటి పాదయాత్రలు ఎంతగానో దోహదపడతాయని వెల్లడించారు. సైనికుల్లా పనిచేసే కార్యకర్తలే పార్టీకి బలం, భవిష్యత్తు అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాధికగౌడ్, సరిత, సువర్ణ, కుర్మయ్య, రఘురాములుగౌడ్, శంకర్‌రెడ్డి, నర్సింహ, మదన్‌గౌడ్, రమేష్‌గౌడ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభను విజయవంతం చేయండి

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

మొయినాబాద్: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు లక్షలాది మంది నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. గురువారం మొయినాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత హామీలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పాలన, పథకాల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ అందించిన సంక్షేమ పథకాలే ఇప్పుడు పార్టీకి శ్రీరామ రక్ష అని.. ప్రజలంతా మళ్లీ బీఆర్‌ఎస్‌వైపే చూస్తున్నారన్నారు. రజతోత్సవ సభ విజయవంతం కోసం ఈ నెల 12న మొయినాబాద్‌లోని స్టార్ కన్వెన్షన్ హాల్‌లో జరిగే చేవెళ్ల నియోజకవర్గ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొత్త నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జయవంత్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు రావూఫ్, దప్పు రాజు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు మాణిక్‌రెడ్డి, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి, నాయకులు రవియాదవ్, నర్సింహాగౌడ్, అంజయ్యగౌడ్, పరమేశ్ తదితరులు ఉన్నారు.

# కులమతాలను వాడుకుంటున్న ప్రభుత్వాలు

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

మొయినాబాద్: ప్రస్తుత పాలకులు అధికారం కోసం కులమతాలను వాడుకుంటున్నారని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి ఆరోపించారు. మార్చి 23 భగత్‌సింగ్ వర్ధంతి నుంచి ఏప్రిల్ 14 అంబేడ్కర్ జయంతి వరకు సీపీఐ చేపడుతున్న రాజకీయ ప్రచారాన్ని గురువారం ఆ పార్టీ నాయకులు మొయినాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులు నాడు దేశ స్వాతంత్ర్యం కోసం కులమతాలకు అతీతంగా ప్రాణత్యాగం చేశారన్నారు. కానీ నేటి పాలకులు అధికారం కోసం కులమతాలను రెచ్చగొట్టి యువతలోని ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, జిల్లా అధ్యక్షుడు అంజయ్య, మహిళా నాయకురాలు మంజుల, నాయకులు పాల్గొన్నారు.

# ఉరుములు, మెరుపులతో వర్షం

చల్లబడిన వాతావరణం

మొయినాబాద్‌రూరల్: ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 5 గంటల వరకు దాదాపు గంటన్నరసేపు ఈదురుగాలులతో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ప్రజలకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది.

**చేవెళ్లలో ఈదురుగాలులతో..**

చేవెళ్ల: మండలంలో సాయంత్రం సమయంలో ఈదురుగాలులతో వర్షం కురిసింది. వాతవారణం పూర్తిగా మారిపోయి భారీగా గాలులు వీయటంతో వ్యవసాయ పొలాల వద్ద చెట్లు విరిగిపడ్డాయి. మండలంలోని పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడి వైర్లు తెగిపోయాయి. దీంతో గంటల తరబడి విద్యుత్ అంతరాయ ఏర్పడింది. అదేవిధంగా చేవెళ్లలో వారంతపు సంత నిర్వహణలో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు.

**వడగండ్ల వర్షం**

షాబాద్: మండలంలో గురువారం మధ్యాహ్నం వడగండ్ల వర్షం కురిసింది. దీంతో 3 గంటలపాటు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి ఎండ ఉండి వర్షం పడడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.



అమ్డాపూర్‌లో కురుస్తున్న వర్షం



షాబాద్‌లో కురుస్తున్న వర్షం

# పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి



షాద్‌నగర్: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సంధ్యారాణి

షాద్‌నగర్: పోషకాహారంతోనే ప్రతీ ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి సూచించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలం అన్నారం సెక్టార్ పరిధిలోని విఠ్యాల అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె తల్లిపాల విశిష్టత, పోషకాహారంపై మహిళలకు అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటే పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారన్నారు. ప్రతిరోజు తీసుకునే ఆహారంలో పాలు, పండ్లు, గుడ్లు, పప్పులు, ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారాన్ని అందిస్తుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, ఏఎన్‌ఎం సునీత, అంగన్‌వాడీ టీచర్లు సుమలత, శంకరమ్మ, ఆశకార్యకర్త పద్మ, ఆయాలు, గర్భిణులు, బాలింతలు,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

**విధిగా పోషకాహారం తీసుకోవాలి**

కొత్తూరు: గర్భిణులు, బాలింతలు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి సూచించారు. మండల పరిధిలోని గూడూరు గ్రామంలో గురువారం నిర్వహించిన పోషణ పక్షోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పోషకాహార లోపంతో రక్తహీనత, ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా పోషకాహారాన్ని తీసుకొని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సరిత, అంగన్‌వాడీలు రజనీ, సుజాత, ఆశవర్కర్ కవిత తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: పోషకాహారం పంపిణీ చేస్తున్న సూపర్‌వైజర్ రేవతి, అంగన్‌వాడీలు

**గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారాలు తీసుకోవాలి**

కేశంపేట: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారాన్ని తీసుకుంటే బిడ్డలు ఆరోగ్యంగా ఎదుగుతారని ఐసీడీఎస్ కేశంపేట సెక్టార్ సూపర్‌వైజర్ దివ్యసింగ్ అన్నారు. మండల పరిధిలోని కేశంపేట సెక్టార్‌లోని దేవునిగుడితండా, కొత్తపేట సెక్టార్‌లోని సంగెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఐసీడీఎస్ కేశంపేట, కొత్తపేట సెక్టార్ సూపర్‌వైజర్లు శమంత, దివ్యసింగ్ పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు శశికళ, శివలీల, సువర్ణ, ఆశ కార్యకర్త అరుణ తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట: సంగెంలో..

## క్లుప్తంగా

### రామాలయ నిర్మాణానికి విరాళం



గౌడ సంఘం సభ్యులకు నగదు అందజేస్తున్న దాత రాఘవేందర్‌గుప్తా

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని హైతాబాద్ మాజీ సర్పంచ్ కావలి మల్లేశ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రామాలయానికి అదే గ్రామానికి చెందిన శ్రీరామ్ రాఘవేందర్‌గుప్తా రూ.50వేల నగదును విరాళంగా గౌడ సంఘం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామాలయం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు మట్ట నారాయణగౌడ్, కొండ రాజుగౌడ్, మట్ట శేఖర్‌గౌడ్, నరేశ్‌గౌడ్, కొండ సురేష్‌గౌడ్, ఎంజమూరి సత్యనారాయణగౌడ్, కందికొండ వెంకటేశ్‌గౌడ్, నరేశ్‌గౌడ్, గౌడ సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

### బడుగుల అభ్యున్నతే లక్ష్యం

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్‌గుప్తా



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న వెంకటేశ్‌గుప్తా, నాయకులు

షాద్‌నగర్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే బీజేపీ లక్ష్యమని జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా అన్నారు. పార్టీ ఆవిర్భావ వేడుకలను గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కందివనం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు నాయకులతో కలిసి పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రధాని మోదీ ఆహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. అదేవిధంగా నిరుపేదల అభ్యున్నతికి కేంద్రం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తుందన్నారు. పల్లెల అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు తమ సత్తా చాటి గ్రామస్థాయిలో పార్టీ జెండాను ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల సురేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ప్లాట్ల క్రమబద్ధీకరణ ఫీజు చెల్లింపు గడువును ప్రభుత్వం పెంచినందుకుగాను గురువారం పట్టణ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కబీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి మంచిరేవుల అశోక్, సభ్యులు అజ్మత్, ఖాలేద్, దాస రమేశ్, శ్రీనివాస్‌చారి, శ్రీను, రఘు, దర్శన్, యాదగిరి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

### జార్జిరెడ్డి వర్ధంతి సభల పోస్టర్ ఆవిష్కరణ

చేవెళ్ల: కామ్రేడ్ జార్జిరెడ్డి 53వ వర్ధంతి సభలను పెద్దఎత్తున విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజేశ్ అన్నారు. చేవెళ్లలో గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం, మతోన్మాదానికి వ్యతిరేకంగా, మహిళలపై జరిగే లైంగిక దాడులకు వ్యతిరేకంగా పిడికిలి బిగించి పోరాడిన మహనీయుడు జార్జిరెడ్డి అని గుర్తుచేశారు. ఆయన 53వ అమరత్వాన్ని స్మరించుకుంటూ ఈ నెల 10 నుంచి 14వ తేదీవరకు నిర్వహించే వర్ధంతి సభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బి.శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు అశోక్, సమీర్, అభిషేక్ తదితరులు ఉన్నారు.